నాడు-నేడు



నాడు: బాలనగర్‌లోని దుతమడుగు తండాలో మౌలిక వసతులు లేని పాఠశాల భవనం



నేడు: 'మన ఊరు-మన బడి'తో మారిన దుతమడుగు తండా పాఠశాల భవనం

# పాఠశాల విద్యకు మహర్దశ

## 'మన ఊరు మన బడి'తో విద్యార్థుల తల రాతలు మార్చిన సీఎం కేసీఆర్‌కు జనం జేజేలు

మెదక్ రూరల్, నవంబర్5: గత పాలకులు తెలంగాణ ప్రాంతంపై నిర్లక్ష్యం చూపని రంగమంటూ లేదు. రాష్ట్ర అభ్యున్నతికి బాటలు వేసే విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. గతంలో జిల్లా చాలా చోట్ల భూత్‌బంగ్లాను తలపిస్తూ కనిపించే భవనాల్లోనే చిన్నారులు చదువుకునేవారు. ఎప్పుడు గోడలు కూలుతాయో.. పైకప్పు ఊడి మీద పడుతుందో తెలియని స్థితిలో విద్యార్థులు బిక్కుబిక్కుమం టూ చదువుకునేవారు. కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చాక పాఠశాల విద్యకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్ర తివాచీ పరిచారు. పిల్లలు బడి బాట పట్టాలంటే పాఠశాల భవంతులు చక్క గా ఉండాలన్న ఉద్దేశంతో సర్కారు బళ్లలో నమోదు, హాజరు, ఉత్తీర్ణత శాతాలను పెంచేలా 'మన ఊరు మన బడి'కార్యక్రమాన్ని తీసుకువచ్చారు. దీంతో మెదక్ మండల పరిధిలోని 'బాలనగర్'లోని దుతమడుగు తండా ప్రభుత్వ పాఠశాల ఎన్నో ఏళ్ల తరబడి పలు అవసరాలతో కొట్టుమిట్టాడుతున్న ఈ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు 'మన ఊరు-మన బడి'పరిష్కారం చూపింది. ప్రభుత్వ నిధులతో సర్పంచ్ వికాస్ ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను 'మన ఊరు మన బడి'తో పరిష్కరించి ప్రైవేట్ పాఠశాలకు దీటుగా మరమ్మతులు చేయించి రంగులతో అందంగా తీర్చిదిద్దాడు. ఇప్పుడు ఆ పాఠశాల భవనం కొత్తగా కనిపిస్తుండంతో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటామని తండావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు



విద్యారంగంలో నాటి పాలనకు, నేటి పాలనకు చాలా తేడా కనబడుతున్నది. పల్లె ప్రగతి, 'మన ఊరు-మన బడి'కార్యక్రమంతో పేద విద్యార్థుల తల రాతలు మార్చే గొప్ప నిర్ణయం తీసుకున్నందుకు కు సీఎం కేసీఆర్‌కు తండా ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ దీటుగా ఆంగ్ల బోధన ప్రవేశ పెట్టడం, అల్పాహారం, మధ్యాహ్న భోజనం పౌష్టికాహారం లాంటి మౌలిక వసతులు సమకూర్చడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. దీంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నది.

– వికాస్, సర్పంచ్ బాలనగర్



ఎంఎస్‌ఎస్‌వోలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## సొంత గూటికి ఎంఎస్‌ఎస్‌వో సభ్యులు

రామాయంపేట, నవంబర్ 5: బీఆర్‌ఎస్ పార్టీ ఉద్యమ కాలం నుంచి పనిచేసిన ఇద్దరు యువ నాయకులు సొంతగూటికి చేరుకున్నారు. ఆదివారం అక్కన్నపేటకు చెందిన శ్రీకాంత్ సాగర్, రామాయంపేటకు చెందిన మధుసూదనాచారి గత దశాబ్దకాలంగా బీఆర్‌ఎస్ పార్టీలోనే పనిచేశారు. కొన్ని కారణాలతో మైనంపల్లి స్థాపించిన ఎంఎస్‌ఎస్‌వో స్వచ్ఛంద సేవలో పనిచేశారు. ఇప్పటివరకు బీఆర్‌ఎస్‌లో మల్కాజిగిరి ఎమ్మెల్యేగా పనిచేసిన మైనంపల్లి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో తమకు మనసొప్పక సొంతపార్టీలోకి వచ్చామని తెలిపారు. వీరిద్దరిని రామాయంపేట ఏఎంసీ మాజీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, రామాయంపేట మాజీ ఎంపీపీ సంపత్ కుమార్, కో ఆప్షన్ సభ్యులు బాలుగౌడ్, ఎస్కే హైమద్, ఉమామహేశ్వర్ గులాబీ పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు.



మెహర్‌బాబాకు పూజలు చేస్తున్న భక్తులు

## అవతార్ మెహర్‌బాబాకు అభిషేకాలు

రామాయంపేట, నవంబర్ 5: రెండవ రోజు అవతార్ మెహర్‌బాబాకు భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని బాబాకు పుష్పాభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం బాబా సన్నిధికి చేరుకున్న భక్తులు వేద పఠనాలు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్టాల అధ్యక్షుడు రామకృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో రాంచంద్రం, ఏలూరి రవీందర్, పెట్టేరు బెండ శ్రీశైలం, తోట శ్రీనివాస్, బచ్చు ప్రభాకర్, నరసింహ్మం బాలరాజు, విద్యాకర్‌రాజు, ఇందూరి రామాగౌడ్ ఉన్నారు.

## కాంగ్రెస్‌కు బూత్ కన్వీనర్ రాజీనామా

చిన్నశంకరంపేట, నవంబర్5: చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామ బూత్ కమిటీ కన్వీనర్ సాయికుమార్ ఆదివారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. పార్టీ కోసం పని చేసిన నాయకులకు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో సరైన గుర్తింపు లేదని, పార్టీలో సభ్యత్వం లేని వారికి ఎమ్మెల్యే టికెట్లను కేటాయిచిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ గడ్డుకాలంలో ఉన్నప్పుడు పార్టీ పటిష్టత కోసం పని చేసిన నాయకులను కార్యకర్తలను గుర్తించకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో గుర్తింపు లేకపోవడంతోనే పార్టీకి రాజీనామా చేశానని, ఏ పార్టీలోకి వెళ్లేది త్వరలోనే వెల్లడిస్తానని సాయికుమార్ తెలిపారు.

నాడు-నేడు



నాడు : సమైక్యపాలనలో గుంతల మయంగా రాజేంద్రనగర్ వ్యాపార కేంద్రం



నేడు : స్వరాష్ట్రంలో రాజేంద్రనగర్‌లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు

## నాడు సతమతం.. నేడు సౌకర్యం..

రామాయంపేట, నవంబర్ 5: సమైక్యపాలనలో నాటి ప్రభుత్వాలు నిధులను కేటాయించక నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నాడు మారుమూల గ్రామాలకు, తండాలకు కాదు కాదా.. కనీసం పట్టణాలకు వెళ్లేందుకు కూడా సరైన రోడ్లు ఉండేవి కాదు. రామాయంపేటలోని రాజేంద్రనగర్ వైపు వెళ్లే.. వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగస్తులతోపాటు సకల జనులు సరైన రోడ్డు మార్గాలు లేక సతమతం అయ్యేవారు. కానీ, రోజులు మారాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో కేసీఆర్ ముఖ్యమంత్రి కావడంతో సకల సమస్యలకు పరిష్కార మార్గం దొరికింది. నాడు గుంతలమయంగా ప్రతి రోడ్డు మార్గాలను సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులు రూ. 10 లక్షల నిధులు కేటాయించి రాజేంద్రనగర్ సీసీరోడ్లు వేయించారు. నాడు సరైనరోడ్డు లేక దుమ్ము, దూళితో సతమతమైన వ్యాపారులు నేడు సీసీరోడ్లతో కళకళలాడుతున్న రోడ్లను చూస్తూ.. హాయిగా తమ దుకాణల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయాలు జరుపుకుంటున్నారు. గట్లుంటది మరి.. సమైక్య పాలనకు.. స్వరాష్ట్ర పాలనలో తేడా అంటు జనం చర్చించుకుంటున్నారు.



## గోపూజతో ఇంటికి పవిత్రత

రామాయంపేట, నవంబర్ 5: ప్రతిరోజు మన ఇండ్లలో గోపూజ, తులసి పూజ చేస్తే మన ఇంటికి ఎంతో పవిత్రత లభిస్తుందని ప్రముఖ వేదాంతి, పండితుడు వేధకరాచార్య అన్నారు. ఆదివారం కార్తీకమాసం సం దర్భంగా రామాయంపేట పట్టణంలోని గోగ్రస నిలయంలోని గోశాలలో యజ్ఞ హోమాలు, తులసిమాత పూజలు చేపట్టారు. మనం వెలిగిస్తున్న దీపాలు మనల్ని ఆయురారోగ్యాలతో కాపాడుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షుడు పబ్బ సత్యనారాయణ, ఏలూరి రవీందర్‌గుప్తా, ఎర్రం ముత్యాలు, కట్ల రాజు, జాలిగామ రఘుపతిగౌడ్, పుట్టి మల్లేశం, అనంతలక్ష్మి, చంద్రకళ, స్వర్ణ, స్వరూప ఉన్నారు.

## కేసీఆర్ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరు

- మైనంపల్లి డాంబికాలు ఇక్కడ చెల్లవ్..
- మెదక్‌లో భారీ విజయంతో పద్మరెడ్డి గెలుపు తథ్యం
- మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

రామాయంపేట, నవంబర్ 5: ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సీఎంగా హ్యాట్రిక్ కొట్టబోతున్నారని, కేసీఆర్ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని బీఆర్‌ఎస్ రామాయంపేట మండల అధ్యక్షుడు బండారి మహేందరరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం రామాయంపేట రూరల్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మెదక్ అసెంబ్లీలో పద్మక్క భారీ మెజార్టీ సాధించి తీరుతుందని, కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌కు మెదక్ అసెంబ్లీలో స్థానం లేదని, మెదక్ నియోజకవర్గం పద్మా దేవేందర్‌రెడ్డికి పెట్టిన కోట అని అన్నారు. మైనంపల్లి అనుకున్నంత ఈజీగా మెదక్‌లో గెలువడం సాధ్యం కాదని, హైదరాబాద్ డాంబికాలు ఇక్కడ పనిచేయవని విమర్శించారు. కొడుకు కోసం మెదక్ టికెట్ ఆశించి భంగపడ్డ మైనంపల్లికి కూడా పరాజయం తప్పదని ఎద్దేవా చేశారు. పద్మక్కకు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభంజనం ముందు ఏ పార్టీలు పనిచేయవని, మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేని అన్నారు. (నేడు) సోమవారం రామాయంపేట మండలంలోని లక్మాపూర్, కాట్రియాల, దంతెపల్లి, పర్వతాపూర్, కిషన్ నాయక్ తండా తదితర గ్రామాలు, గిరిజన తండాల్లో పద్మా దేవేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు నర్సాగౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, సీనియర్ నాయకుడు అక్షయ్‌కుమార్, సర్పంచులు సుభాశ్, మల్లేశం, బీఆర్‌ఎస్ నాయకులు పిట్ల బూలింగం, ఉమామహేశ్వర్, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మైసాగౌడ్ పాల్గొన్నారు.



రామాయంపేటలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి



మల్లికార్జున స్వామి సన్నిధిలో భక్తులు

## మల్లన్నకు భక్తుల పూజలు

మెదక్ రూరల్, నవంబర్ 5: మెదక్ మండలంని మంబోజిపల్లి శివారులోని కొయ్యగుట్ట పై కొలువుదీరిన శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం ఆలయ పూజారి మల్లన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు స్వామికి ఒడిబియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.